## క్లుప్తంగా

### ఎమ్మెల్సీ అరుణకుమార్‌కు సత్కారం



**తాడేపల్లిరూరల్ :** శాసనమండలి సభ్యులు, అసోసియేషన్ చీఫ్ పాట్రన్ మొండితోక అరుణకుమార్‌ను శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం నాయకులు తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లను సమీక్షించేందుకు ఐఏఎస్ అధికారుల కమిటీని నియమించడంలో ప్రధాన భూమిక పోషించారని తెలిపారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, ఎమ్మెల్సీ అరుణకుమార్‌కు తమ సమస్యలను విన్నవించామన్నారు. అరుణకుమార్ ఎంతో చొరవ చూపి యుద్ధ ప్రాతిపదికన ఐఏఎస్‌ల కమిటీ ఏర్పాటుకు కృషి చేశారని, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల పట్ల ఎంతో నిబద్ధతతో ఉంటూ వారి సంక్షేమం కోసం పాటుపడిన ఆయనను ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల తరుపున ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ సత్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సీహెచ్ ఆనంద్, క్యాపిటల్ రీజియన్ ప్రెసిడెంట్ వై.వి. సుధాకర్‌బాబు, ఎన్టీఆర్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎం.రాఘవులు పాల్గొన్నారు.

### పేటకు తరలివెళ్లిన పల్లకీలు



**పెనుగంచిప్రోలు:** రంగుల ఉత్సవం ముగించుకొని శ్రీతిరుపతమ్మ అమ్మవారితోపాటు సహదేవతల విగ్రహాల తిరుగు ప్రయాణానికి పల్లకీలను రజకులు అందంగా ముస్తాబుచేసి శనివారం పెనుగంచిప్రోలులో ఊరేగించారు. అనంతరం పల్లకీలను లారీల్లో జగ్గయ్యపేటకు తరలించారు. పెనుగంచిప్రోలు–5, అనిగండ్లపాడు, ముండ్లపాడు, సుబ్బాయిగూడెం నుంచి ఒక్కో పల్లకీ కలిపి మొత్తం ఎనిమిది పల్లకీలను రజకులు తమ సొంతడబ్బులతో వెచ్చించి అందంగా ముస్తాబు చేశారు. తొలుత పల్లకీల ముందు కొబ్బరికాయలు కొట్టి గ్రామంలో ఊరేగించారు. జగ్గయ్యపేటకు బయలుదేరిన పల్లకీల వెంట పెద్దసంఖ్యలో గ్రామస్తులు తరలివెళ్లారు.

### శ్మశానవాటిక అభివృద్ధికి శంకుస్థాపన



**కంచికచర్ల :** శ్మశానవాటిక భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని కీసరలో జెడ్పీ నిధులు రూ.7.50లక్షలతో చేపట్టిన హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఈ నిధులతో హిందూ శ్మశానవాటికలో కంపచెట్లను తొలగించడంతోపాటు చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో శ్మశానవాటికల అభివృద్ధికి విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) నిధులు మంజూరు చేశారన్నారు. శ్మశానవాటిక ల్లో ప్రభుత్వ నిధులతోపాటు సొంత నిధులతో అనేక బోర్లు వేయించామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, నాయకులు వేల్పుల రమేష్, పరిటాల రాము, పాపట్ల స్వామి, నిస్సార్‌పాషా, చలమల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### హెచ్‌ఐవీ నియంత్రణపై కళాజాత



**పరిటాల(కంచికచర్ల) :** మండలంలోని పరిటాలలో శనివారం జాతీయ హెచ్‌ఐవీ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కళాకారులు కళాజాత నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణ, నిర్మూలనకై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమాచారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1097కు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు.

### విదేశీ సిగరెట్లు స్వాధీనం

**పడమట(విజయవాడ తూర్పు):** విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు విజయవాడలో విదేశీ సిగరెట్లు దందాను శనివారం అడ్డుకున్నారు. అక్రమంగా నగరంలో వీటి విక్రయాలు జరుపుతున్న ముఠాపై అధికారులు కన్నేసి ఆటోనగర్‌లోని ఓ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు కంపెనీలో నిల్వచేసిన రూ.10 లక్షలు విలువ చేసే సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సిగరెట్లను పడమట పోలీస్ స్టేషనుకు తరలించారు. సీజ్ చేసిన సిగరెట్లు ప్రస్తుతం తమ పోలీస్ స్టేషన్ లోనే ఉన్నట్లు పటమట పోలీస్ స్టేషన్ సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు.

# సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

**ప్రభుత్వ విప్ ఉదయభాను**



వలంటీర్లను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, నాయకులు

**నందిగామ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలులోకి తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ దేశంలోని అన్నిరాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని నందిగామ మండలం కొండూరు గ్రామంలో రూ.90లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా పాలన ప్రజల ఇళ్లముంగిటకే వచ్చిందన్నారు. తద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సాధించారని వివరించారు. గతంలో ఆయా పనులపై ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, కాని నేడు సచివాలయ వ్యవస్థతో ప్రజలకు అవసరమైన అన్నిరకాల పౌరసేవలు గ్రామ పొలిమేర దాటే అవసరం లేకుండానే అందుతున్న విషయాన్ని గుర్తించాలని కోరారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయని, ఆయా రాష్ట్రప్రభుత్వాలు ఈ పథకాల అధ్యయనం కోసం ప్రత్యేక బృందాలను పంపిస్తుండటమే అందుకు నిదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు వి శ్రీనివాసరావు, దేవినేని నాగేశ్వరరావు, మేడా కోటేశ్వరరావు, దేవినేని రామారావు, చెరుకూరి రమేష్, కనగాల వెంకటేశ్వరరావు, కొల్లూరు ఉమామహేశ్వ



కొండూరులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న సామినేని ఉదయభాను

రరావు, ఏరువ వీరాంజనేయులు, ఆదాం, ఏటిపట్టు గ్రామాల నాయకులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

**వలంటీర్లకు సన్మానం..**

ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధులు వలంటీర్లేనని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. కొండూరులో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలందించిన ఏటిపట్టు గ్రామాలకు చెందిన 113 మంది వలంటీర్లను ఆయన ఘనంగా సత్కరించారు. వలంటీర్లందరికీ రూ.15వేలను నగదు బహుమతిగా అందజేసి అభినందించారు. సేవావజ్ర అవార్డుకు ఎంపికైన మాగల్లు గ్రామానికి చెందిన వలంటీర్ తోట ప్రసన్నకుమార్‌కు అవార్డుతోపాటు రూ.45వేల నగదు బహుమతి, షీల్డ్, మెడల్‌ను అందజేశారు. అనంతరం విప్ ఉదయభాను మాట్లాడుతూ వలంటీర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు. ప్రజలకు అత్యుత్తమ సేవలందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తున్న వలంటీర్లంటే టీడీపీ అధినేత చంద్రబాబుకు కడుపుమంటగా ఉందన్నారు. అందుకే వలంటీర్లను కూడా బాబు విమర్శిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, ఏటిపట్టు గ్రామాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# మేలు జరిగితేనే మళ్లీ ఓటేయ్యండి

**ఎమ్మెల్యే జగన్‌మోహనరావు**

**కీసర, పెండ్యాల(కంచికచర్ల):** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగునెలల తొమ్మిదినెలల పాలనా కాలంలో మీకు మేలు జరిగిందని భావిస్తేనే రానున్న ఎన్నికల్లో మరోసారి ఓటేసి తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పిలుపునిచ్చారు. మండలంలోని కీసర, పెండ్యాల గ్రామాల్లో శనివారం ఆయన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతిఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల క్యాలెండర్లను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధితోపాటు ప్రజాసంక్షేమ కోసం లక్షలాది కోట్ల రూపాయలను ఖర్చు చేసిన ఘనత సీఎం జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. వలంటీర్ల వ్యవస్థను అమల్లోకి తెచ్చి ప్రజలకు అవసరమైన పనులన్నింటినీ గ్రామస్థాయిలోనే పూర్తిచేస్తున్నారన్నారు. రైతును రారాజుగా చేస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పార్టీకి ఓట్లేసి గెలిపించాలని, జగనన్నను మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, ఎంపీటీసీ సభ్యులు షేక్ బడేహజరత్, వేల్పుల రమేష్, పరిటాల రాము, పాపట్ల స్వామి, చలమల ప్రభాకర్, నెలకుదిటి శివనాగమల్లేశ్వరరావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీఆర్వో హసీనాబేగం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



కీసరలో సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

# నేడు పెనుగంచిప్రోలుకు అమ్మవారు పయనం



పేటలో స్వామివార్లను దర్శించుకునేందుకు బారలుతీరిన భక్తులు



రంగుల మండపంలో స్వామివార్లకు పూజలు చేస్తున్న పూజరులు, భక్తులు

**జగ్గయ్యపేట:** పట్టణంలోని కాగితాలబజారు రంగుల మండపం వద్ద కొలువుదీరిన శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారు, సహదేవతలు ఆదివారం ప్రత్యేక పల్లకీల్లో తిరిగి పెనుగంచిప్రోలు పయనం కానున్నారు. రెండేళ్లకొకసారి తిరుపతమ్మ అమ్మవారితోపాటు సహదేవతల విగ్రహాలను రంగుల మహోత్సవానికి జగ్గయ్యపేటకు తీసుకువస్తారు. ఆనవాయితీలో భాగంగా ఈనెల ఒకటిన పెనుగంచిప్రోలు నుంచి రంగుల మహోత్సవం కోసం పేటకు వచ్చిన శ్రీతిరుపతమ్మ, గోపయ్యస్వామితోపాటు 11సహదేవతల విగ్రహాలకు 18రోజుల పాటు రంగుల మండపంలో ఉంచి ఆనవాయితీ ప్రకారం గాజుర్ల కుటుంబీకులు రంగులు దిద్దారు.

**మొక్కులు చెల్లించుకున్న భక్తులు ..**

అమ్మవారితోపాటు స్వామివార్ల విగ్రహాలు తెల్లవారుజామున 5.02గంటలకు రంగుల మండపం నుంచి పెనుగంచిప్రోలుకు ప్రత్యేక పల్లకీల్లో బయలుదేరనున్నాయి. ఆలయ అధికారులు, పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. జగ్గయ్యపేట, చిల్లకల్లు మీదుగా వత్సవాయి మండలం భీమవరం, లింగగూడెం మీదుగా పెనుగంచిప్రోలుకు సోమవారం అర్ధరాత్రికి చేరుతాయి. విగ్రహాల పయనంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ జానకిరామ్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఎనిమిది ఎస్‌ఐలతోపాటు మొత్తం 150మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారు పెనుగంచిప్రోలుకు బయలుదేరనున్న నేపథ్యంలో శుక్రవారం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

### క్రీడాకారులకు అభినందన



**కంచికచర్ల :** ఇటీవల విజ్ఞాన్ మహోత్సవ్‌లో భాగంగా గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయస్థాయిక్రీడాపోటీల్లో తమ కళాశాలకు చెందిన కబడ్డీ క్రీడాకారులు ద్వితీయ బహుమతిని సాధించారని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కే రామ్మోహనరావు తెలిపారు. కళాశాలలో శనివారం కబడ్డీ క్రీడాకారులను అభినందించారు. కరస్పాండెంట్ రామ్మోహనరావు మాట్లాడుతూ 64ఇంజినీరింగ్ కళాశాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో తమ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి గెలుచుకోవడం ఆనందంగా ఉందంటూ వారిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు అకడమిక్స్ తోపాటు క్రీడలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ద్వితీయ బహుమతిని సాధించడం ద్వారా విద్యార్థులు కళాశాల పేరుప్రఖ్యాతులను మరింత ఇనుమడింపజేశారంటూ వారిని అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ఎం.శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాసరావు, పి.శివరామకృష్ణ, అన్ని విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

**వీరులపాడు:** మండలంలోని ఆయా గ్రామాల్లో రాజకీయపార్టీలకు సంబంధించి ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరని నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. వీరులపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మహాలక్ష్మణుడుతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రతిఒక్కరు నడుచుకోవాలని ముఖ్యంగా అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే సహించేది లేదన్నారు. మండలంలోని జుజ్జూరులో ఇటీవల ఏర్పాటు చేసిన రాజకీయపార్టీల ఫ్లెక్సీలను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల సందర్భంగా రాజకీయ పక్షాల నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. ఇప్పటికే నేరప్రవృత్తి కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు సీఐ వివరించారు. అనంతరం తహసీల్దార్ రాజకిషోర్, ఎంపీడీవో శివపార్వతి, విద్యుత్ శాఖాధికారుల సమక్షంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగింపజేశారు.

# వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారిని అభినందిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

**నందిగామ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నందునే ఆయా వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీ వైపు ఆకర్షితులవుతున్నారని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సాయిబాబా మందిర ధర్మకర్త పాములపాటి వెంకటేశ్వర్లుతోపాటు పలు కుటుంబాలవారు టీడీపీని వీడి శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈసందర్భంగా ఉదయభాను వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఉదయభాను మాట్లాడుతూ కొద్దిరోజులుగా నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలో చేరేవారి సంఖ్య పెరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో మరింత నమ్మకం పెరగడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. సీఎం జగనన్న పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో ముందంజలో ఉందన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రజలకు పథకాలు అందుతున్నాయని వివరించారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, నాయకులు పాల్గొన్నారు.

# ప్రత్యేకాకర్షణగా మహనీయుల విగ్రహాలు





పరిటాలలో హైవే పక్కన ఏర్పాటు చేసిన జాతీయ నాయకుల విగ్రహాలు

**పరిటాల(కంచికచర్ల):** మండలంలోని పరిటాలలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన జాతీయ నాయకుల విగ్రహాలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. పరిటాల జాతీయ రహదారి పక్కన గ్రామ సచివాలయం వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రాం, మహాత్మా జ్యోతీరావ్‌పూలే, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేసి ఇటీవల ఆవిష్కరించారు. విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు కొద్దిసేపు ఇక్కడ ఆగి జాతీయ నాయకుల విగ్రహాలను ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ విగ్రహాల ఏర్పాటుకు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతా రవీంద్రనాథ్, యద్దనపూడి విజయారావు, అమ్రితసాయి, ఎంఈఆర్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు సహకారం అందించినట్లు గ్రామస్తులు తెలిపారు.

# స్విమ్మింగ్ పోటీల్లో పేటకు పతకాల పంట

**2స్వర్ణం, 11రజిత, 11కాంస్య పతకాలు**



జాతీయస్థాయి ఈత పోటీల్లో పతకాలు సాధించిన జగ్గయ్యపేట స్విమర్లు

**జగ్గయ్యపేట అర్బన్:** ఇటీవల గోవాలోని ఫటోర్డా, మార్గో స్విమ్మింగ్ పూల్ కాంప్లెక్స్‌లో మాస్టర్స్ గేమ్స్ వారు నిర్వహించిన 6వ జాతీయ ఈతల పోటీల్లో జగ్గయ్యపేటకు చెందిన స్విమ్మర్లు విశేష ప్రతిభను కనబరిచి పతకాల పంట పండించారు.ఈ జాతీయస్థాయి ఈతల పోటీల్లో పేటకు చెందిన డ్రీమర్స్, స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు దిడ్డి పాండురంగారావు, పొట్టాబత్తిన లక్ష్మి, పరిణం రమాదేవి, కూరపాటి సీతాదేవి, యంద్రాతి రామారావు, రాయపూడి నీహారిక, ఏనుగుల సీతారావమ్మ, తమ్మరపు నాగమణి, గంపల సాంబశివరావు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రెండు స్వర్ణ పతకాలు, 11రజిత, 11కాంస్య పతకాలు కలిపి మొత్తం 24 పతకాలు సాధించినట్లు జట్టు మేనేజర్ అన్నంనీడి కళ్యాణ్ శనివారం తెలిపారు. కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగారావు, లక్ష్మి సారథ్యంలో విజేతలుగా నిలిచిన స్విమ్మర్లకు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, డాక్టర్ సామినేని దీపక్‌కుమార్, పేట మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు రంగాపురం రాఘవేంద్ర, తుమ్మల ప్రభాకర్, మాజీఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, అసోసియేషన్ అధ్యక్షుడు మండవ శ్రీనివాసరావు, సెక్రటరీ కలాలి నరేష్, కుర్ర శ్రీనివాస్, చిట్యాల మోహన్‌రావు, అప్పన అయ్యప్ప, కన్వీనర్ యలదండి శ్రీనివాసరావు, కృష్ణా స్విమ్మర్స్ అసోయేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డీఎస్‌పీ కిషోర్‌బాబు, అధ్యక్షులు పిన్నెల్లి పాండురంగారావు, పూర్వ అధ్యక్షులు రాటకొండ శ్రీనివాస్, అల్లి శ్రీనివాస్,చెరుకూరి రమేష్, కొల్లి మార్షల్ స్టాలిన్, గోగిశెట్టి మహేష్ అభినందనలు తెలియజేశారు.

# పర్యాటక కేంద్రంగా పేట ఊరచెరువు అభివృద్ధి



ఊరచెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రాఘవేంద్ర, ప్రభాకర్

**జగ్గయ్యపేట అర్బన్:** జిల్లాలోనే మేటి పర్యాటక కేంద్రంగా పేట ఊరచెరువును అభివృద్ధి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. తద్వారా ఊరచెరువు జగ్గయ్యపేటకు ల్యాండ్ మార్క్‌గా మారనుందని వివరించారు. ఊరచెరువు వద్ద శరవేగంగా సాగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఊరచెరువు అభివృద్ధి ప్రాజెక్టు మొదటిదశ పనులను రూ.3కోట్లతో చేపట్టినట్లు వివరించారు. ఇప్పటికే వాకింగ్ ట్రాక్ పూర్తయిందన్నారు. చెరువు చుట్టూతా ఫుట్‌పాత్, మెస్ ఏర్పాటు పనులు వేగంగా సాగుతున్నాయని వివరించారు. త్వరలోనే ఊరచెరువును పర్యాటకకేంద్రంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ కొలగాని రాము, సాయి ఉన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగిఉండాలి



మాట్లాడుతున్న జడ్జి షేక్ రియాజ్

**నందిగామ:** ప్రతిఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ సూచించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మునగచర్ల సమీపంలోని పీఎస్సీ బోస్ డ్రైవింగ్ స్కూల్‌లో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి రియాజ్ మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా తగుజాగ్రత్తలు పాటించాలన్నారు. మోటార్ వాహనాల చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

**ఉచితంగా న్యాయ సలహాలు...**

**జగ్గయ్యపేట అర్బన్ :** ఉచిత న్యాయ సలహాలు అందించేందుకు జగ్గయ్యపేట కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కె.శ్రావణి సూచించారు. కోర్టు ఆవరణలో చేసిన ఫ్రంట్ ఆఫీసును శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి కె.శ్రావణి మాట్లాడుతూ ప్రజలకు ఉచిత న్యాయసలహాలను ఇచ్చేందుకు ప్యానల్ లాయర్‌తోపాటు పారాలీగల్ వలంటీర్ కూడా ఈ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజలు న్యాయ సలహాలు తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏజీపీ టీఎల్ నరసింహారావు, లీగల్ ప్యానల్ న్యాయవాదులు ఎం.విజయకుమారి, డి.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సిబ్బంది కృష్ణ, పారాలీగల్ వలంటీర్ పాల్గొన్నారు.

# విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి సూచించారు. కళాశాలలో ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో నగదు పురస్కారం అందుకున్న విద్యార్థి డీ వివేక్ అభినందన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో తమ కళాశాల విద్యార్థి వివేక్ పర్యావరణంలో మార్పులు–మానవ తప్పిదాలు అనే మోడల్ చేసి అందరినీ మెప్పించడంతో పాటు నగదు పురస్కారం అందుకోవడం కళాశాలకే గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల పరిశీలన



బీఎల్వోలకు సూచనలిస్తున్న కమిషనర్ హేమమాలిని

**నందిగామ:** రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని నందిగామ పట్టణ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్, ఏఈఆర్‌ఓ కె.హేమమాలిని తెలిపారు. పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన వసతులపై సిబ్బందితో చర్చించి, ఈ మేరకు ఆదేశాలిచ్చారు. ఏఈ ఫణి శ్రీనివాసరావు, బీఎల్వోలు పాల్గొన్నారు.

**వీరులపాడు మండలంలో..**

**వీరులపాడు:** పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని వీరులపాడు తహసీల్దార్ రాజకిషోర్ తెలిపారు. మండలంలోని జుజ్జూరు, పెద్దాపురం, గూడెంమాధవరం, అల్లూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. అన్ని వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.